క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

దేవరపల్లి: గోపాలపురం మండల వైఎస్సార్ సీపీ సమావేశం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు గోపాలపురంలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని హోం శాఖ మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

కార్యకర్తలకు అండగా..



ధర్మరాజు కుటుంబానికి సాయం అందిస్తున్న మండల నాయకులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. గంటావారిగూడెంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త అనారోగ్య కారణంగా దొబ్బిడి ధర్మరాజు (పండు) ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబానికి మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. బంక అప్పారావు, తోట వెంకట్రావు, తాడిగడప శ్రీనివాస్, నక్కా పండు, శెనగన సతీష్‌గౌడ్, అందుగుల వెంకటేశ్వరావు, పెనుమాక వెంకటరత్నం, సయ్యద్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

కొవ్వూరు: కొవ్వూరు పట్టణంలో త్రోబాల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహి ంచనున్నట్టు సన్‌రైజర్స్ యూత్ సభ్యులు తెలిపారు. ఈ నెల 12, 13, 14, 15 తేదీల్లో ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ క్రికెట్ పోటీలు కొనసాగుతాయన్నారు. పట్టణంలో ఎన్టీఆర్ క్రీడాప్రాంగణంలో పోటీలు కొనసాగుతాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు చొప్పున అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 96662 31109, 86888 72644 నంబర్లను సంప్రదించాలన్నారు.

వజ్ర వనిత వాసవీక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొవ్వూరు: వజ్ర వనిత వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మద్దుల నాగమణి, కార్యదర్శిగా తటపర్తి రాజేశ్వరి, కోశాధికారిగా కక్కిరాల కృష్ణవేణిలను ఎన్నుకున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే వీర వెంకట వరప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్, బంగారు కాశీ అన్నపూర్ణ, ఉప్పల శ్రీవల్లి, వలివేట రామలక్ష్మి, గ్రంధి ప్రవీణ్, వలివేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ జ్యోతి బయో వెంచర్స్ సంస్థ వార్షిక తనిఖీకి లేఖ

తాళ్లపూడి: అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని అరుణ జ్యోతి బయో వెంచర్స్ లిమిటెడ్‌కి చెందిన టాటా వాటర్ ప్యాకేజ్ యూనిట్ అనుబంధ పరిశ్రమను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం వార్షిక తనిఖీల లేఖ అందజేసిట్టు మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు తెలిపారు. పరిశ్రమలకు చెందిన వివరాలను సేకరించి, రాష్ట్ర ఆదాయ వనరులు అంచనాలు తయారు చేస్తామని, దీనిలో భాగంగా 2023–24వ సంవత్సర జమా ఖర్చుల వివరాలు, ఆస్తులు అప్పులు వంటి 9 రకాల వివరాలు తెలియజేయాలని ఆయన తెలిపారు. వీఆర్వో కావూరి నాగేశ్వరరావు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాలన్నీ ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలని నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి సూచించారు. ఆ గ్రామంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో సెంటర్‌కు ఐదు చొప్పున కుర్చీలను శనివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్ద పల్లి సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలో అనారోగ్య బాధితులకు శనివారం మండల మానవత సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. నల్లజర్లలో బోడ సుబ్బలక్ష్మికి రూ.4 వేలు, షేక్ షబీనాకు రూ.5 వేలు, చీపురుగూడెంలో కొరపాటి చిన వెంకటేశుకు రూ.4 వేలు,, నాగలక్ష్మికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.18 వేలు పంపిణీ చేశారు.

అనుమతులు లేకుంటే చర్యలే

తాళ్లపూడి: అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులపై, అర్హత లేని సిబ్బందితో నడిపే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో జె.సంధ్య పేర్కొన్నారు. తాళ్లపూడిలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సాయి స్ఫూర్తి ఆస్పత్రి వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలపై ఆంక్షలున్నాయని, వాటిని తనిఖీ చేస్తున్నామని, తాళ్లపూడి లోని అశోక మల్టీ స్పెషలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు కోసం దరఖాస్తు చేశారని తెలిపారు.

పందెం కోడి రెఢీ

- సిద్ధమైన బరులు
- నిర్వహణలో పందెంరాయుళ్లు

పెరవలి: కోడిపందాలు, జూదం నిర్వహించకూడదని పోలీస్, రెవెన్యూ శాఖలు ప్రచారాలు, అవగాహన సదస్సులు జోరుగా చేస్తుంటే మరో వైపు అదే స్థాయిలో కోడిపందేలు నిర్వహణ కోసం బరులు సిద్ధం చేస్తున్నారు. నిర్వాహకులు పందెం కోసం కోళ్లను రెడీగా ఉంచారు. మండలంలో ఖండవల్లి, ముక్కామల, పెరవలి, అజ్జరం, వెంకట్రాయపురం, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల్లో పందేల నిర్వహణ జోరుగా ఏర్పాట్లు చేశారు. ఒకవైపు హైకోర్టు ఉత్తర్వులు ఉండడం, జిల్లా ఎస్పీ కోడి పందాలపై ఉక్కుపాదం మోపడంతో పందేలు జరుగుతాయా లేదా అని పందెంరాయళ్ల మీ మాంసలో పడ్డారు. ఇప్పటికే కోడి కత్తుల 110 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడం, గత పందెం నిర్వాహకులు 160 మందిపై బైండోవర్ కేసులు పెట్టారు. మరోవైపు రెవెన్యూ శాఖ కోడి పందాలు నిర్వహించే స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చారు. కోడిపందేలు నిర్వహించే బరుల వద్ద పోలీసు శాఖ బ్యానర్లు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా తమ పనులు చేసుకుపోతున్నారు. కోడి పందాలు బరులు వద్ద భారీస్థా యిలో జూదం కూడా జరిగే పరిస్థితి ఉంటుందని ఔత్సాహికులు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు కోళ్లు పెంచినా, అమ్మినా నేరమేనని, కోడిపందాలు జరగనివ్వమని చెప్పుతున్నా ఉన్నతాధికారుల నుండి పండుగ రోజైనా ఆదేశాలు వస్తాయని అప్పటి వరకు కంగారు పడాల్సిన పనిలేదని నిర్వహకులు అంటున్నారు. ఏదిఏమైనా ఈ సంక్రాంతి పండగ కోడి గెలుస్తుందా ఖాకీ గెలుస్తుందా అనేది సోమవారం మధ్యాహ్నానికే తెలుస్తుంది.



ఉసులుమర్రులో పందానికి సిద్ధంగా ఉన్న కోళ్ళు



ఖండవల్లిలో కోడిపందాల బరి సిద్ధం చేస్తున్న యజమానులు

పల్లెసీమలు సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు



తాళ్లపూడిలో అధ్యాపకులు, విద్యార్థినులు సందడి



సంక్రాంతి వేడుకల్లో గొబ్బెమ్మలు పెట్టి నృత్యం చేస్తున్న చిన్నారులు

తాళ్లపూడి: తాళ్లపూడిలోని కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యా సంస్థల్లోని ఇంటర్, డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకలను విద్యాసంస్థల డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి ప్రారంభించారు. విద్యార్థినుల ముగ్గుల పోటీలు, నృత్యాలు, బోగి మంటలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఇంటర్ విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, మ్యూజికల్ చైర్ తదితర క్రీడలను నిర్వహించారు. సంక్రాంతి క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సంక్రాంతి వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళి, వైస్ ప్రిన్సిపాల్ డి.మాధవరావు, అధ్యాపకులు పాపారావు, రాజేష్, సత్యనారాయణ, అమరేంద్ర, గీత, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో సంక్రాంతి సంబరాలు ఆబాలగోపాలం వేడుకగా జరుపుకొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోను, ప్రైవేట్ పాఠశాలలోను, దేవాలయ ప్రాంగణాలలోను రంగ వల్లులు వేశారు. పాఠశాల డైరెక్టర్ వల్లిపల్లి వెంకట రామారావు విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేశారు. చిన్ని కృష్ణుడు, గోపికలు వేషధారణలతోను, హరిదాసు వేషధారణలోను చిన్నారులు అలరించారు. చాగల్లులోని–64 కేంద్రంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మేరీ రత్నం, మౌన్యశ్రీ, సదా లక్ష్మీలకు మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ చేతుల మీదగా బహుమతులు అందించారు.

డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

దేవరపల్లి: స్థానిక ఆనంద్ ఎడ్యుకేషన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలువురు విద్యార్థినులు పాల్గొని ముగ్గులు వేశారు. పోటీలను కళాశాల కరస్పాండెంట్ డి. సువర్ణరాజు ప్రారంభించారు. రంగవల్లుల పోటీలతో పాటు కబడ్డీ, వాలీబాల్, వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు కరస్పాండెంట్ సువర్ణరాజు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, ఏఓ ఆనందప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో కషాయాల పిచికారీ

తాళ్లపూడి: డ్రోన్ సహాయంతో నూతన సాంకేతిక విధానంలో మందులు పిచికారీ కార్యక్రమం చేపడుతున్నట్టు జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి తెలిపారు. వేగేశ్వరపురంలో శనివారం ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సాయంతో 30 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ కషాయ ద్రావణాలను వరి పంటపై పిచికారీ చేశారు. జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి మాట్లాడుతూ వరి పంటలపై పురుగులు తెగులు నియంత్రణ కోసం వేప గింజల ఇంగువ కషాయాన్ని డ్రోన్ సాయంతో పిచికారీ చేశామన్నారు. వరి పంటలపై కాండం తొలిచే పురుగు రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారీ చేయాలన్నారు. డివిజన్ ఇన్‌చార్జి మహారాణి ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది డి.భీష్మాంబ, మణికంఠ, ధర్మరాజు, వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో డ్రోనుతో కషాయాలు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దేవరపల్లి: ప్రకృతి వ్యంసాయంలో వరి పంటపై ఆశిస్తున్న తెగుళ్ల, పురుగులను అరికట్టడానికి డ్రోన్‌తో పంటలపై కషాయాలను పిచాకారీ చేస్తున్నారు. ప్రతి మండలంలో 250 ఎకరాలను ఎంపిక చేసి డ్రోన్‌తో కషాయాలను పిచికారీ చేస్తున్నట్టు డివిజన్ మాస్టారు ట్రైనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం దేవరపల్లిలో వరి పంటపై డ్రోన్‌తో కషాయాలు, పొగాకు పంటపై పురుగు మందులను పిచికారీ చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చాగల్లు: మండలంలో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. ఈ మేరకు శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఏపీ హైకోర్టు, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో కోడి పందాలు, గుండాట, పేకాట నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో కోడిపందేలు పేకాటలో నిర్వహిస్తే పోలీసులతో పాటు స్థానిక వీఆర్వోకి, గ్రామ సచివాలయ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలని మండల ప్రజలను ఆమె సూచించారు.

వేలివెన్నులో శశి వార్షికోత్సవం

ఉండ్రాజవరం: శశి వేలివెన్ను క్యాంపస్‌లో శనివారం సాయంంంంత్రం 45వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ డీజీపీ మండవ విష్ణువర్ధన్ రావు(ఐపీఎస్), అట్లూరి వెంకరత్న ప్రసాద్ వైస్ ఛాన్సలర్, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ హాజరై మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచే బాధ్యతగా పనులు అలవర్చాలని, ప్రతి చిన్నారి ప్రత్యేకమేనని, వారిని ఎవరితోనూ పోల్చకూడదని తల్లిదండ్రులకు హితవు పలికారు. శశి విద్యాసంస్థల ఫౌండర్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతమైన సంకల్పంతో జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి చిన్నారులకు ఆదర్శంగా నిలవాలని, మొబైల్‌ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



శశిలో వార్షికోత్సవ సంబరాల్లో మాజీ డీజీపీ విష్ణువర్ధన్‌రావు, వేణుగోపాలకృష్ణ, రవికుమార్ తదితరులు

ఈసందర్భంగా చిన్నారుల ఆటపాటలతో, కేరింతల కోలాహలంతో శశి ప్రాంగణం మార్మోగింది. అనంతరం పూర్వ విద్యార్థులకు, చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

చాగల్లు: స్థానిక చాగల్లు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న డ్రైనేజీ వద్ద శనివారం పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై కె.నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం జమాలూర్ జంక్షన్ నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ట్రైన్ నుంచి సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వే స్టేషన్ అధికారులు తెలియజేడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

ఉండ్రాజవరం: మండలంలో కాల్ధారి, చివటం, తాడిపర్రు, పాలంగి తదితర గ్రామాల్లో శనివారం పంచాయితీ కార్మికులకు ఆయా గ్రామాల సర్పంచులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినిత్యం గ్రామాన్ని శుభ్ర పరుస్తూ, ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే పారిశుద్ధ్య కార్మికులు సంక్రాంతి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలన్నారు. సర్పంచ్‌లు శ్రీనివాసు, ఈద్పుగంటి సత్య నారాయణ, నరేంద్ర, కుమారి, సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి


నల్లజర్ల: ప్రభుత్వ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ పత్రాల(లైఫ్ సర్టిఫికెట్ల)ను ఫిబ్రవరి 28లోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఐవీ సత్యం తెలిపారు. శనివారం నల్లజర్లలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సమావేశం ఐవీ సత్యం అధ్యక్షతన జరిగింది. 50 మందికి ఆన్‌లైన్‌లో జీవన పత్రాలు నమోదు చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌ఎం ఆలీసాహెబ్, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరావు, జిల్లా ఈసీ మెంబర్ ఏసురత్నం, ప్రభుదాస్, ప్రతాప్, బాలయ్య, సహాధ్యక్షులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కూడారై సేవ

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కూడారై సేవ ఉత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి వారిని, అమ్మవార్లను విశేషంగా అలంకరణ చేసి అర్చకులు సేవ ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంతాన సాఫల్యం సులభతరం

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాంగ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళలల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనీ యాంగ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్ టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.



జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణ రెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కానూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు



ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరం విద్యార్థులు

పెరవలి: ఆ నాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు నెమరువేసుకుంటూ 1984–85 సంవత్సరంలో కానూరులో చదువుకున్న పదో తరగతి పూర్వవిద్యార్థుల సందడికి అదే పాఠశాల వేదికయ్యింది. శనివారం కానూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. చదువులు అయిపోయిన తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. రోజంతా సందడి చేశారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులైన ఈద్పుగంటి సుబ్బారావు, పెదపూడి నారాయణరావు, బమిడిపాటి సుబ్బారావు, బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆ నాటి విద్యార్థులు ఎంతో ఎదిగి మమ్మల్ని గుర్తించుకుని మీ ప్రగతి చెప్పుతుంటే మాకు ఆనందంగా ఉందన్నారు. ఆనాటి విద్యార్థులు కొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోను, కాంట్రాక్టర్ల గాను, వ్యాపారస్తులుగా కొనసాగటం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు ముల్లపూడి రాజేంద్ర ప్రసాద్, జేష్ఠ వెంకటేశ్వరరావు, వీరమల్లు శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్, సాదా మునీశ్వరరావు, బావన కృష్ణమూర్తి, బొండాడ విశాలాక్షి, టీవీ జానకీరాణి, అనపర్తి సీతారత్నం ఎంతో చక్కగా నిర్వహించారు. 82 మంది కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో 1994–95లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడి వారంతా పాఠశాలలో కలుసుకుని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈకార్యక్రమంలో శిరసపల్లి సత్యనారాయణ, పొట్ల సురేష్, దొరబాబు, రామకృష్ణ, అబ్బులు శ్రీదేవి, సత్యవతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిరైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నిడదవోలు రూరల్: పాడిరైతులు ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని విజ్జేశ్వరంలో ఉపాధిహామీ నిధులు రూ.1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిలు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 680 మినీ గోకులం షెడ్లు మంజూరు చేయగా ఇప్పటివరకు 304 షెడ్లు నిర్మాణం పూర్తి చేశామన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సాంప్రదాయ పద్ధతిలో గోమాతకు పూజలు నిర్వహించారు. పొలంలో మంత్రి దుర్గేష్ వరి నాట్లు వేశారు. ఎడ్లబండిపై మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి గ్రామానికి విచ్చేసి మహిళలు వేసిన రంగవల్లులను తిలకించారు. భోగిమంటలను వెలగించి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తిక్కాశ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ డి.లక్ష్మినారాయణ, తహసీల్దార్ నాగరాజు నాయక్, నాయకులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎడ్లబండిపై మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి తదితరులు

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

నిడదవోలు: క్రీడలు మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని, యువత క్రీడలపై దృష్టి సారించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో నిడదవోలు సర్కిల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సంక్రాంతి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. త్వరలో నిడదవోలు పట్టణంలో మినిస్టేడియం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, పట్టణ ఎస్సై పి.శోభన్ కుమార్, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సీసీఎం నాయకుడు రాంబాబు, పీఈటీలు బి.ప్రదీప్, కేవీడీఎం స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.